## క్రైం కార్నర్

### పురుగుల మందు తాగి ఆత్మహత్య

నడికూడ : పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన పులిగిల్ల గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ అమ్మ సంతోష్(40) అదే గ్రామానికి చెందిన సుభాష్‌రెడ్డి వద్ద సంవత్సరానికి రూ.2 లక్షల చొప్పున తీసుకొని ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గత నెలలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఆరు నెలలు డ్రైవర్‌గా పని చేయడంతో సుభాష్‌రెడ్డికి తిరిగి ఒక లక్ష రూపాయాలను అక్టోబర్ 10లోగా ఇవ్వాలని గ్రామ పెద్దలు తీర్పు చెప్పారు. మనస్తాపం చెందిన సంతోష్ ఇంట్లో ఎవరులేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**చికిత్స పొందుతూ ఒకరు..**

దామెర : చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వేల్పుల శంకర్(49) కూలిపని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. అతడికి ఇద్దరి కుమార్తెలు. వారు మానసిక వ్యాధితో బాధపడుతున్నారు. కాగా వారి చికిత్స కోసం అప్పులు చేశాడు. అప్పులు ఎలా తీర్చాలని మానసికంగా కృంగిపోయేవాడు. ఈ క్రమంలో గత నెల 28వ తేదీన ఇంట్లో గడ్డిమందు తాగాడు. గమనించిన బధువులు చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. శంకర్ భార్య స్వరూప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

**కడుపునొప్పి భరించలేక మరోకరు..**

కమలాపూర్ : మండలంలోని కన్నూరుకు చెందిన ఈదునూరి క్రాంతికుమార్ (30) కడుపునొప్పి భరించలేక పురుగుల మందుతాగి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు సీఐ హరికృష్ణ తెలిపారు. హనుమకొండలోని కోకాకోలా కంపెనీలో సేల్స్‌మెన్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్న క్రాంతికుమార్.. గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలోనే ఈనెల 9న కడుపునొప్పి రాగా భరించలేక ఈనెల 10వ తేదీన గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు హుటాహుటిన జమ్మికుంటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, హనుమకొండలోని మరో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి మొగిలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

## క్లుప్తంగా

### ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలి

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ చెరువు శిఖంలో భూముల ఆక్రమణ, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని బీజేపీ మండల నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. వెంటనే విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ఆర్‌టీఐ జిల్లా కన్వీనర్ శ్రావణ్‌కుమార్, మండల ప్రధానకార్యదర్శి పైడి, మాజీ మండల అధ్యక్షుడు సదానందం, సాంబయ్య పాల్గొన్నారు.

### ఆరోపణలు సరికాదు

ఆత్మకూరు : కోళ్లను చంపానని తనపై మండల కేంద్రానికి చెందిన మంతుర్తి కొమురయ్య ఆరోపించడం సరికాదని ఆత్మకూరుకు చెందిన మంతుర్తి రవి తెలిపారు. బధవారం విలేకరులతో మాట్లాడారు. తనపై వ్యక్తిగత కక్షతో నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాడని తెలిపారు. పోలీసుల విచారణలో తన తప్పు లేదని తెలిందని అన్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్

నడికూడ : మండలంలోని రామకృష్ణపూర్‌లో కొంత మంది పేకాడుతున్నారనే సమాచారం మేరకు దాడులు నిర్వహించినట్లు ఏఎస్సై రమేశ్ తెలిపారు. పేకాడుతున్న ఎరుకల మహేందర్, ఎరుకల రాజు, పెండ్లి మహేందర్, పెండ్లి దేందర్, నల్ల దేవేందర్, గాజు కిరణ్, పెండ్లి తిరుపతి నుంచి రూ.14,050 నగదు, ఆరు సెల్ ఫోన్‌లు, పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

**ఆత్మకూరులో..**

ఆత్మకూరు : ఆత్మకూరు మండలంలోని చౌళ్లపల్లి సమీపంలో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. 7 ఫోన్లు, రూ.10వేల 860 నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సంతోష్ పేర్కొన్నారు. చౌళ్లపల్లికి చెందిన పూజారి శివకృష్ణ, పూజారి కుమార్, ఏరుకొండ రాజేష్, పూజారి కుమార్, పూజారి మనోహరస్వామి, బొమ్మగాని నవీన్, పూజారి భాస్కర్ అరెస్టయిన వారిలో ఉన్నారు.

### నేడు రక్తదాన శిబిరం

పరకాల : మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా యువ నేతాజీ సేవా సంస్థ ఆధ్వర్యంలో గురువారం స్థానిక సివిల్ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంస్థ సభ్యుడు ముస్తాఫా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంతో పాటు ఇతర మండలాల నుంచి ప్రతిఒక్కరూ భాగస్వాములై రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

# మూడేళ్ల మురిపెం..!

- రైతు వేదికల నిర్మాణాల్లో నాణ్యతాలోపం
- బీటలు వారుతున్న గోడలు
- కుంగిన ఫ్లోరింగ్, పగిలిన టైల్స్
- పట్టించుకోని అధికారులు



మండల కేంద్రంలో నిర్మించిన రైతు వేదిక

దామెర : గ్రామీణ ప్రాంత రైతులకు పంట సాగులో ఆధునిక పద్ధతులు, శాస్త్రసాంకేతిక రంగంలో మార్పులపై ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం రైతువేదిక నిర్మాణాలు చేపట్టింది. అందులో భాగంగా గ్రామాలను క్లస్టర్లుగా విభజించి రైతు వేదికలను నిర్మించారు. ఒక్కో రైతు వేదికకు సుమారు రూ.23 లక్షలు వెచ్చించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించడంతో భవనాలు శిథిలమవుతున్నాయి. మండలంలోని నాలుగు క్లస్టర్లు దామెర, పులుకుర్తి, ఊరుగొండ, తక్కళ్లపహాడ్‌లో రైతు వేదికల్లో రైతు సదస్సులు నిర్వహించడంతో పాటు అధికారిక కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహిస్తున్నారు.

**మూడేళ్లకే శిథిలావస్థలో..**

కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన రైతు వేదికలు మూడేళ్లకే శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రతి భవనానికి మరమ్మతులు చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. మండల కేంద్రంలోని రైతు వేదిక భవనంలో గోడలకు పగుళ్లు ఏర్పడి ఫ్లోరింగ్ కుంగిపోయింది. దీంతో పార్కింగ్, ఫ్లోరింగ్ టైల్స్‌కు పగుళ్లు ఏర్పడి ధ్వంసమయ్యాయి. ఒగ్లాపూర్ క్లస్టర్ రైతు వేదిక భవనాన్ని తక్కళ్లపహాడ్‌లో నిర్మించగా గోడలకు పగుళ్లు ఏర్పడటంతో పాటు టైల్స్ కూడా ధ్వంసమయ్యాయి. ఊరుగొండలో నిర్మించిన వేదిక గోడలు శిథిలం కావడంతో కూలిపోయే పరిస్థితి ఏర్పడింది. పులుకుర్తిలో కూడా భవనం బీటలు వారాయని, మరమ్మలు చేపట్టాలని ఆయా గ్రామాల్లోని రైతులు కోరుతున్నారు.

**అదనపు నిధులు మంజూరు..**

భవనాల నిర్మాణల కోసం ఉపాధిహామీ నిధుల నుంచి రూ. 23 లక్షలు మంజూరు చేయగా నియోజకవర్గ నిధుల నుంచి మరో రూ. 5 లక్షలు వెచ్చించి మొత్తం రూ.28 లక్షలతో నిర్మాణాలు చేపట్టారు. ఊరుగొండలో చేపట్టిన భవనం కోసం గ్రామపంచాయతీ నిధుల నుంచి మరో రూ. 4లక్షలు మంజూరు చేశారు. అదే విధంగా దామెరలో భవన నిర్మాణం కోసం మండల పరిషత్ నిధుల నుంచి మరో రూ. 3 లక్షల 20 వేలు మంజూరు చేశారు.

**నాణ్యతాలోపంతో నిర్మాణాలు..**

మండలంలో నిర్మించిన రైతు వేదికలన్నీ నాణ్యతాలోపంతో నిర్మించడంతో మూడు సంవత్సరాలకే శిథిలావస్థకు చేరుకున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. నిర్మాణాలు చేపట్టే సమయంలో అధికారులు పట్టించుకోకపోవడంతోనే కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేపట్టారని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై ఉన్నతాధికారులు దృష్టిసారించి సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.


దామెర రైతు వేదికలో పగిలిన ఫ్లోరింగ్ టైల్స్


ఊరుగొండలో పెచ్చులూడుతున్న గోడ


తక్కళ్లపహాడ్‌లో ధ్వంసమైన పార్కింగ్ టైల్స్

### విచారణ చేపట్టాలి



రైతు వేదికల నిర్మాణంలో భాగంగా కాంట్రాక్టర్లు నాసిరకం పనులు చేపట్టారు. ఇదేమి పట్టనట్లు వ్యవహరించిన అధికారులు బిల్లులు మంజూరు చేశారు. కాగా ఉన్నతాధికారులు దృష్టిసారించి నాణ్యత లోపంతో చేపట్టిన పనులపై విచారణ చేపట్టాలి. సదరు అధికారులపై చర్యలు తీసుకోవాలి. నిర్మాణ పనులపై అధికారులు దృష్టి సారించకపోవడంతో ప్రజాధం వృథా అయ్యింది.

– శ్రీరాంరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు

### మరమ్మతులు చేయాలి



తక్కళ్లపహాడ్ రైతు వేదికలో భూమికుంగి పార్కింగ్ టైల్స్, ఫ్లోరింగ్ టైల్స్ పగిలిపోయాయి. గోడలకు బీటలువారి కూలిపోయే దుస్థితికి చేరుకున్నాయి. లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతు వేదికలు మూడేళ్లు గడవకముందే కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టాలి.

– అంక సురేందర్, తక్కళ్లపహాడ్, రైతు

### ఉన్నతాధికారులకు నివేదిస్తాం

మండలంలో నిర్మించిన రైతు వేదిక భవనాలను పరిశీలించాం. అవి పగుళ్లు, భూమి కుంగిపోయి ఫ్లోరింగ్ దెబ్బతిన్నట్లు గుర్తించాం. వాటి మరమ్మతుల కోసం ఉన్నతాధికారులకు నివేధించి, త్వరలో వాటికి మరమ్మతులు చేసే విధంగా చర్యలు తీసుకుంటాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దు.

– అల్లే రాకేశ్, ఏఓ

### ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు



ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ చెరువులో ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న గణేశ్ నిమజ్జనం నేపథ్యంలో చేస్తున్న ఏర్పాట్లను అధికారులు బుధవారం పరిశీలించారు. తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సంతోష్, ఐబీ డీఈ వేణుగోపాల్ క్షేత్రస్థాయిలో పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. కట్ట ప్రదేశాన్ని చదును చేయాలని, జేసీబీ అందుబాటులో ఉంచాలని అన్నారు.

కమలాపూర్ : మండల కేంద్రంలో గణపతి నిమజ్జనోత్సవాల నిర్వహణ కోసం మండల అధికారులు బుధవారం స్థల పరిశీలన చేశారు. స్థానిక పెద్ద చెరువును, చెరువు కట్టను పరిశీలించి గణపతి నిమజ్జనాలకు అనువైన ప్రదేశాన్ని గుర్తించారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ గుండె బాబు, సీఐ హరికృష్ణ, ఎంపీఓ రవి, ఆర్‌ఐలు నర్సింహులు, శ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### రోబోటిక్స్ ఇన్ అకడమిక్స్‌పై శిక్షణ

ధర్మసాగర్ : మండలంలోని పెద్దపెండ్యాల జెడ్పీహెచ్‌ఎస్‌లో 7,8,9 వ తరగతి చదువుతున్న 103 మంది విద్యార్థులకు సోహం అకడమీ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో బుధవారం రోబోటిక్స్ ఇన్ అకడమిక్స్‌పై శిక్షణ ఇచ్చారు. గత వారం కాకతీయ డిగ్రీ కళాశాలలో శిక్షణ తీసుకున్న విద్యార్థిని, విద్యార్థుల సహకారంతో పాఠశాలలో రోబోటిక్స్ ట్రెనింగ్ జరిగింది. హెచ్‌ఎం బత్తిని రాజేందర్, టీం లీడర్ స్పందన పాల్గొన్నారు.

## 11 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


రేషన్ బియ్యం, టాటా ఏసీని అదుపులోకి తీసుకున్న ఎస్సై

శాయంపేట : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై ప్రమోద్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల మండలం వెల్లంపల్లి గ్రామానికి చెందిన ఎండి.తాజుద్దీన్ గ్రామాల్లో తిరుగుతూ ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నాడు. ఈ క్రమంలో గట్లకానిపర్తి గ్రామ శివారులో టాటా ఏసీ వాహనంలో రేషన్ బియ్యం అన్లోడింగ్ అవుతున్నట్లు పక్కా సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి వెళ్లగా టాటా ఏసీ వాహనంలో రేషన్ బియ్యం నిల్వ చేసి ఉన్నట్లు తెలిపారు. పోలీసుల రాకను గమనించి వ్యక్తి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకున్నామని అన్నారు. అతడిని విచారించగా పూర్తి వివరాలు వెల్లడించినట్లు పేర్కొన్నారు. తాను కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని ఎక్కువ ధరకు విక్రయించేందుకు వెంకటేశ్వర బిన్నీ రైస్ మిల్ వద్దకు వచ్చానని తెలిపాడన్నారు. రేషన్ బియాన్ని, వాహనాన్ని స్వాధీనం చేసుకుని అతడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

దామెర : పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ స్వాతి అన్నారు. జాతీయ పోషణమాసం సందర్భంగా మండల కేంద్రంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సామూహిక శ్రీమంతాలు, వెల్ బేబీ షో నిర్వహించి బహుమతులు అందజేశారు. ఏసీడీపీఓ భాగ్యలక్ష్మి, తహసీల్దార్ జ్యోతివరలక్ష్మీదేవి, ఎస్సై అశోక్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాణి, ఉమాదేవి, ఏపీఓ శారద, ఆర్‌ఐ సంపత్ పాల్గొన్నారు.

### రోడ్లపై ఆటోలు నిలపొద్దు

శాయంపేట : రోడ్లపై ఆటోలను నిలిపి ఇతరులకు ఇబ్బందులు కలిగించొద్దని సీఐ రంజిత్‌రావు అన్నారు. మండల కేంద్రంలో డ్రైవర్లకు, వ్యాపారస్తులకు, గ్రామస్తులకు బుధవారం ట్రాఫిక్ రూల్స్, సీసీ కెమెరాలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్‌రూల్స్ పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని అన్నారు. అలాగే సీసీ కెమెరాలతో నేరాలను అదుపు చేయవచ్చని, సీసీ కెమెరాల ఏర్పాటుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఎస్సై ప్రమోద్‌కుమార్ ఉన్నారు.

### బీమా పాలసీ పొందాలి

శాయంపేట : భారతీయ జీవిత బీమా సంస్థ అందిస్తున్న బీమా పాలసీని ప్రతిఒక్కరూ పొంది తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని ఎల్‌ఐసీ పరకాల బ్రాంచ్ మేనేజర్ విశ్వనాథన్ కోరారు. మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్‌హాల్‌లో బుధవారం మండల స్థాయి ఏజెంట్ల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఎల్ఐసీ ప్రవేశపెట్టిన జీవన్ లాభ్, జీవన్ ఆనంద్, జీవన్ ఉమాంగ్, జీవన్ ఉత్సవ్ పాలసీలను తీసుకోవాలని అన్నారు.

## బాలికల సంరక్షణ అందరి బాధ్యత


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఇందిర

ఆత్మకూరు : బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని సర్వోదయ సంస్థ ట్రెనింగ్ కోఆర్డినేటర్ ఇందిర అన్నారు. మండలంలోని పెద్దాపూర్‌లో సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు లింగాధారిత హింస, లింగ సున్నితత్వంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలబాలికలు తమ లక్ష్యానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. విద్యార్థులు మంచి ఆలోచనలతో వ్యక్తిగతంగా బలంగా ఎదగాలన్నారు. పాఠశాలల్లో బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్‌ఎస్ ప్రధానోపాధ్యాయుడు జి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు దేవేందర్, రాంచందర్‌రావు, బాలునాయక్, సునీల్‌కుమార్, అశోక్‌వర్ధన్‌రెడ్డి, పరిపూర్ణాచారి పాల్గొన్నారు.

## ‘గృహజ్యోతి’ని వినియోగించుకోవాలి


అవగాహన కల్పిస్తున్న ఏఈ రమేశ్

దామెర : విద్యుత్ మీటర్లు అమర్చుకుని గృహజ్యోతి పథకాన్ని వినియోగించుకోవాలని ఏఈ గుర్రం రమేశ్ కోరారు. మండలంలోని సింగరాజుపల్లిలో విద్యుత్ మీటర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అక్రమంగా విద్యుత్ వాడకం చట్టరీత్యా నేరమన్నారు. విద్యుత్ మీటర్ లేని వినియోగదారులు రూ.938 చెల్లించి మీటర్ పొందాలని అన్నారు. పాస్‌పోర్ట్‌సైజ్ ఫొటో, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ పత్రాలతో ఈనెల 15 వ తేదీలోగా విద్యుత్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. 17 నుంచి నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకొని 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ చందన, ఆర్సీ అపర్ణ, లైన్‌మెన్ మనోహర్, ఏఎల్‌ఎం కృష్ణ, జేఎల్‌ఎం రాజశేఖర్, రఘు, రజినీకాంత్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఎంపీడీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఐనవోలు : మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బొట్ల చక్రపాణి, మండల కార్యదర్శి కాడబోయిన లింగయ్య కోరారు. ఈ మేరకు బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయం హనుమకొండ జిల్లా కేంద్రంలో కొనసాగుతుందని, దీంతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అదే విధంగా జఫర్‌ఘడ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్, గర్మిళ్లపల్లి గ్రామాలను ఐనవోలు పీఎస్ పరిధిలోకి మార్చాలని కోరారు. మండలంగా ఏర్పాటు చేసి 8 సంవత్సరాలు అవుతున్నా ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు చేయలేదన్నారు. మండల సమస్యలను పరిష్కరించేందుకు ఈనెల 17వ తేదీ వరకు ఎమ్మెల్యేకు సమయం ఇచ్చామని, 18వ తేది నుంచి ప్రజలందరితో కలిసి ఆందోళనకు దిగుతామని తెలిపారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సారంపల్లి వాసుదేవరెడ్డి, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## సాయుధ పోరాటంతోనే హక్కుల సాధన


అమరవీరులకు నివాళులర్పిస్తున్న నాయకులు

ధర్మసాగర్ : సాయుధ పోరాటంతోనే హక్కులను సాధించుకున్నట్లు సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం సాయుధ పోరాట 76వ వారోత్సవాల సందర్భంగా అమరవీరులు కామ్రేడ్ బొడ్డు అబ్రహం, తోకల రాజిరెడ్డి, మంద నారాయణ చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నాడు ప్రజల ధన, మాన, ప్రాణాలకు రక్షించేందుకు ఆంధ్రమహాసభ ఏర్పాటు చేసి వీరోచిత పోరాటాలు చేస్తూ 10 లక్షల ఎకరాల భూముల్ని ప్రజలకు పంపిణీ చేసిన చరిత్ర సీపీఐదన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటంపై బీజేపీ దొంగ మాటలు మాట్లాడుతుందని, అప్పుడు బీజేపీ ఆనవాళ్లు ఉన్నాయా అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో స్మృతి వనం ఏర్పాటు చేసి పోరాట యోధుల విగ్రహాలను ట్యాంక్ బండ్‌పై ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, లక్ష్మి, పద్మ, బొట్టు భిక్షపతి, నాయకులు మల్లయ్య, వెంకటేష్, చిలుక బాబు, రత్తమ్మ పాల్గొన్నారు.

## ఉమ్మడి సర్వీస్‌రూల్స్ అమలు చేయాలి


ఎల్కతుర్తి : మాట్లాడుతున్న టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తిరుపతి


పరకాల : మాట్లాడుతున్న ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు


ఐనవోలు : సభ్యత్వం ఇస్తున్న నాయకులు

ఎల్కతుర్తి : ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను రూపొందించి వెంటనే అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నెబోయిన తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భీమదేవరపల్లి మండలంలోని కొత్తపల్లి, ముల్కనూరు, కొప్పూరు, గాంధీనగర్, వంగర, రత్నగిరి గ్రామాల్లోని ప్రభుత్వ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యారంగ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోర్టు పరిధిలోని సాంకేతిక సమస్యలను పరిష్కరించి ఉపాధ్యాయుల ఉమ్మడి సర్వీస్ రూల్స్‌ను వెంటనే రూపొందించి, ఎంఈఓ, జూనియర్ లెక్చరర్ పోస్టులను ప్రమోషన్ల ద్వారా భర్తీ చేయాలని కోరారు. టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు కొమురయ్య, నాయకులు రాజేంద్రం, ఇప్పకాయల కుమారస్వామి, భిక్షపతి, లక్ష్మణ్, అనిల్, రమేశ్, రమణారెడ్డి, ప్రభాకర్, శంకర్‌నాయక్, ప్రభావతి, రవిప్రకాశ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

**డీఏలు ఇవ్వకపోతే పోరాటమే**

ఐనవోలు : పెండింగ్‌లో ఉన్న ఐదు విడతల డీఏలను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో పోరాటం చేస్తామని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెండెం రాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం మండలంలోని గర్మిళ్లపల్లి, సింగారం, కొండపర్తి, ఐనవోలు ఉన్నత పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు హాజరై మాట్లాడారు. జిల్లా కార్యదర్శులు లింగారావు, శ్రీనివాస్, మండల శాఖ బాధ్యులు బ్రహ్మచారి, విజయభాస్కర్, రాము తదితరులు పాల్గొన్నారు.

**ఎస్టీయూ ఆధ్వర్యంలో..**

పరకాల : ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన నాలుగు డీఏలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు కామగోని రాంబాబు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలుర పాఠశాల, మల్లారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ.. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వలన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

### దేశ సంస్కృతిని కాపాడుకోవాలి



పరకాల : దేశ కోసం, ధర్మ కోసం పనిచేస్తు దేశ సంస్కృతులను కాపాడుకోవాలని తెలంగాణ రాష్ట్ర భజరంగ్ కన్వీనర్ శివరాములు పిలుపునిచ్చారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా పరకాల పట్టణంలోని వీవీఆర్ కాంప్లెక్స్ ఆవరణంలో ఏర్పాటు చేసిన గణపతిని ఉమ్మడి జిల్లా వీహెచ్‌పీ కార్యదర్శి చందర్‌బాబుతో కలిసి దర్శించుకొని పూజలు నిర్వహించారు. వీహెచ్‌పీ జిల్లా సహ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, గిరిప్రసాద్, సునీల్, మహేశ్, రమేష్, అఖిల్, పూజారి పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

### గుంతలు పూడ్చివేసిన కళాకారులు

సాక్షి ఎఫెక్ట్..

కమలాపూర్ : కమలాపూర్ నుంచి దేశరాజుపల్లి వరకు ఉన్న గుంతలను దేశరాజుపల్లికి చెందిన కళాకారులు పూడ్చివేశారు. ‘ప్రమాదకరంగా గుంతలు’ అనే శీర్షికన ఈ నెల 10న సాక్షిలో ప్రచురితమైన కథనానికి కళాకారులు స్పందించారు. దేశరాజుపల్లికి చెందిన మర్విన్ వీడియోస్ ఆధ్వర్యంలో కమలాపూర్ నుంచి దేశరాజుపల్లి వరకు ప్రమాదకరంగా ఉన్న గుంతల్లో బుధవారం సుమారు 20 ట్రిప్పుల మొరం, మట్టి పోసి పూడ్చివేశారు. స్థానిక సీఐ హరికృష్ణ, మర్విన్ వీడియోస్ నిర్వాహకులు బాబురావు, శివాజీ, అరుణాజీ పాల్గొన్నారు.

### ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

పరకాల : పట్టణంలోని సాహితీ కళాశాల విద్యార్థులు ఫ్రెషర్స్ డేను బుధవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఎంఎస్‌రావు గార్డెన్‌లో జరిగిన వేడుకలను ప్రిన్సిపాల్ కె.జనార్దన్‌రావు జ్యోతి ప్రజ్వల చేసి ప్రారంభించారు. విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. డ్యాన్సులు, కేరింతలతో కళాశాల ప్రాంగణం మార్మోగింగి. అనంతరం పలువురు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు కె.రాజు, జయలక్ష్మి, ఎం.ఆర్ రెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ రషీద్ అహ్మద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### భక్తులకు అన్నదానం

కమలాపూర్ : శాయంపేట / దామెర : కమలాపూర్ గుడిబండ వద్ద శ్రీకంఠమహేశ్వర కళామండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుడి మండపం వద్ద భక్తులకు మహా అన్నదానం చేపట్టారు. తహసీల్దార్ సురేష్‌కుమార్, ఎంపీడీఓ గుండె బాబు, సీఐ హరికృష్ణ, ఏఓ లక్ష్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్‌గౌడ్ ప్రారంభించారు. అలాగే దామెర మండల కేంద్రంలోని శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నిర్వాహకులు మోహన్, భిక్షపతి, రవికుమార్, తిరుపతి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా శాయంపేట మండల కేంద్రంలోని కుమ్మరి వీధిలో నూతన మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నప్రసాద వితరణలో ఎస్సై ప్రమోద్‌కుమార్ పాల్గొన్నారు.